# శ్రీ దుద్దిళ్ళ శ్రీపాదరావు

శ్రీ దుద్దిళ్ల శ్రీపాదరావు తొమ్మిదవ శాసనసభ (1989-1994) స్పీకరుగా 1991వ సంవత్సరము ఆగస్టు 19వ తేదీన ఏకగ్రీవంగా ఎన్నికై 1995వ సంవత్సరము జనవరి 11వ తేదీ వరకు ఆ పదవిని నిర్వహించారు. వీరి హయంలో 1993-94వ సంవత్సరంలో మొదటి సారిగా మహిళా శిశు సంక్షేమ కమిటీని ఏర్పాటు చేసారు.

వీరు 1939వ సంవత్సరం నవంబరు 6వ తేదీన కరీంనగర్ జిల్లా మంథని గ్రామంలో జన్మించారు.

వీరు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎల్.ఎల్.బి. పూర్తిచేశారు. 1958-1960 సంవత్సరాల మధ్యకాలంలో ఆదిలాబాద్ జిల్లా ఖానాపూర్ పంచాయతీ సమితి ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తూ, ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాలలో చేరారు. 1964లో ధన్వాడ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా, 1965-1969 సంవత్సరాల మధ్య కరీంనగర్ డిస్ట్రిక్ట్ లైబ్రరీ అథారిటీ సభ్యునిగా, 1965 నుండి 1983 వరకూ మంథని వ్యవసాయాభివృద్ధి బ్యాంకు అధ్యక్షునిగా, 1980 నుండి 1985 వరకూ మహాదేవపూర్ పంచాయతీ సమితి ఉపాధ్యక్షునిగా, ధన్వాడ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ అధ్యక్షునిగా, టుబాకో బోర్డు మెంబరుగా పనిచేశారు.

శ్రీ శ్రీపాదరావు 1983వ సంవత్సరంలో ఏడవ శాసనసభకు, 1985వ సంవత్సరములో ఎనిమిదవ శాసనసభకు, 1989వ సంవత్సరంలో తొమ్మిదవ శాసనసభకు కరీంనగర్ జిల్లా మంథని నియోజవర్గం నుండి శాసనసభ్యుడిగా ఎన్నికైనారు. గ్రంథాలయ కమిటీ, ప్రభుత్వ హామీల కమిటీ మరియు అంచనాల కమిటీలలో సభ్యునిగా ఉన్నారు.

వీరు న్యూఢిల్లీలో 1991వ సంవత్సరములో జరిగిన కామన్‌వెల్త్ పార్లమెంటరీ సమావేశంలోనూ, 1992వ సంవత్సరములో జరిగిన అఖిల భారత స్పీకర్ల సమావేశంలోనూ పాల్గొన్నారు.

శ్రీ శ్రీపాదరావుగారిని 1999వ సంవత్సరం ఏప్రిల్ పదమూడవ తేదీన నక్సలైట్లు కాల్చిచంపారు. వీరు చేసిన సేవలకు గుర్తింపుగా గౌరవ భావంతో కరీంనగర్ జిల్లాలోని ఎల్లంపల్లి ఎత్తిపోతల పథకానికి వీరి పేరు పెట్టడం జరిగింది.

వీరు శాసనసభ స్పీకరుగా మృదు స్వభావంతో వ్యవహరించి అందరి మన్ననలను పొందారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలకే సార్వభౌమాధికారం ఉంటుందని, ప్రజలు ఆ అధికారాన్ని చట్టసభల సభ్యుల ద్వారా వినియోగించుకుంటారని, ప్రభుత్వ విధానాలు చట్టసభలలో జరిగే చర్చల ద్వారానే రూపొందుతాయని, ప్రభుత్వ విధానాల తీరు తెన్నులను తెలుసుకొనే అధికారం ప్రజాప్రతినిధులకు ఉంటుందని, కనుక ప్రజాప్రతినిధులను ప్రభుత్వ కార్యక్రమాలకు ఆహ్వానించడం ప్రభుత్వ అధికారుల కర్తవ్యమని, ఈ విషయంలో ప్రజాప్రతినిధుల ప్రాధాన్యతను తగ్గించివేయటం ఎంతమాత్రం సమర్థనీయం కాదని శ్రీ డి. శ్రీపాదరావు 1994, మార్చి 15వ తేదీన రూలింగులో విశదం చేశారు.